క్లుప్తంగా

సామూహిక కుంకుమ పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఆకివీడు: హిందూ ధర్మ పరిరక్షణకు టీటీడీ ధర్మపరిషత్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఏఎంసీ మాజీ చైర్మన్ వానపల్లి బాబూరావు అన్నారు. మండలంలోని గుమ్ములూరు గ్రామంలోని రామాలయంలో ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సీతారాములోరి ఆలయంలో మహిళలకు కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో సుంకర శ్రీనివాస్, పులగం రంగారావు, చెన్నంశెట్టి అప్పారావు, వానపల్లి వెంకట రామకృష్ణ పాల్గొన్నారు.

అమ్మవార్లకు సారె సమర్పణ



కోమటిగుంటలో సారె తీసుకెళ్తున్న భక్తులు

కాళ్ల: మండలంలోని కోమటిగుంటలో ఉన్న గ్రామ దేవతలు కనకదుర్గమ్మ, మహంకాళమ్మ, వెంకమ్మ అమ్మవార్లకు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం భక్తులు సారె సమర్పించారు. గ్రామంలోని కోదండరామాలయం నుంచి భక్తులు అమ్మవార్లకు పలు రకాల స్వీట్లు, పండ్లు, పిండి వంటలు, పసుపు, కుంకుమ, పూలు, గాజులతో మేళతాళాలు మంగళ వాయిద్యాల నడుమ బాణసంచా కాల్పులతో గ్రామోత్సవంగా సారె ఆలయానికి తీసుకెళ్లారు. అనంతరం భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యలమంచిలి వెంకటరమణ, రామాంజనేయులు, గణపతి, శ్రీనివాస్, మంతెన నాగాంజనేయులు, పులమంతుల ఏసురాజు, యండమంచిలి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వెబ్ దినోత్సవం



సభలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఆకివీడు: భవిష్యత్ ప్రపంచం కృత్రిమ మేథస్సు(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్)దేనని ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత అన్నారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ వెబ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో హోమ్ అప్లియన్స్, వాహనాలు వంటివి రిమోట్ సెన్సార్ల ద్వారానే నడుస్తాయన్నారు. అలాగే పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యపకురాలు డాక్టర్ విజయ పాల్గొన్నారు.

బీరువా అందజేత



బీరువా అందజేస్తున్న దృశ్యం

వీరవాసరం: మండలంలోని రాయకుదురు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 8 సంవత్సరాలుగా భౌతికశాస్త్ర సహాయకులుగా విధులు నిర్వహించి, బదిలీలలో భాగంగా అరట్లకట్ల హైస్కూల్‌కు వెళ్లిన కాశీనాథుని సూర్యవాణి, జగన్నాథరావు దంపతులు శుక్రవారం హైస్కూల్‌కు రూ. 15 వేలు విలువ చేసే బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు సూర్యవాణి, జగన్నాథరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కానుకొలను శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ ఆర్ తులసీ ప్రదీప్, కేవీడీ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



ఇంటింటికీ ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

వీరవాసరం: స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వీరవాసరం మండలంలో స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ఇంటింటికీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం అదాని కంపెనీతో ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. ఈనెల 5న నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బొర్రా నలమహారాజు, సీఐటీయూ నాయకులు ఎం.ఆంజనేయులు, నారాయణమూర్తి, అయినంపూడి బాబూరావు, సుబ్బారావు, సత్తిబాబు ఎం.ఆంజనేయుల, ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

పండు'గొప్పే'

- తీర ప్రాంతాల్లో విస్తరిస్తున్న పెంపకం
- 1 కేజీ దాటితే రూ. 390, 4 కేజీలైతే రూ. 420 కొనుగోలు
- వర్షాలు కారణంగా రొయ్యకు ప్రత్యామ్నాయంగా పండుగప్ప సాగు
- మార్కెట్‌లో భారీగా ధరలు పెరగడంతో పండుగప్పచేపను పెంచేందుకు మొగ్గు చూపుతున్న ఆక్వా రైతులు



పండుగప్ప చేపలకు వేసే చైనా గొరకలు



పండుగప్ప చేపలను మార్కెట్ చేసేందుకు శుభ్రం చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: జిల్లాలో తీర ప్రాంత గ్రామాల్లో పండుగప్ప చేప పెంపకం విస్తరిస్తోంది. ఈ చేపకు దేశ, విదేశాలలో గిరాకి ఏర్పడి ధర పెరగడంతో ఆక్వా రైతులు పండుగప్ప సాగుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో భీమవరం, మొగల్తూరు, నరసాపురం, కాళ్ల మండలాల్లో సముద్రం, ఉప్పుటేరు తీర ప్రాంతాలలో ఈ పండుగప్ప చేపలను సుమారు 2 వేల 500 ఎకరాలలో వర్షాకాలంలో సుమారు 4 వేల ఎకరాలలో పెంచుతున్నారు. ఈ చేప సప్పు, ఉప్పు నీటిలో పెరగడంతో తీర ప్రాంత గ్రామాల్లో ఎక్కువగా పెంపకం చేస్తున్నారు. సాధారణంగా చిన్న చేపలను వేటాడి ఈ చేప తింటుంది. బతికున్న చిన్న చేపలు దొరకకపోవడంతో సముద్రంలో పడవల ద్వారా చిన్న చేపలను వేటాడి వీటికి మేతగా వేస్తున్నామని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది వనామీ రొయ్యలకు వైట్ స్పాట్, విబ్రియో, వైట్‌గట్, ఈహెచ్‌పీ తదితర వైరస్‌లతో నాణ్యమైన సీడ్ దొరకకపోవడంతో వనామీ సాగులో తీవ్రంగా నష్టపోయిన రైతులు పండుగప్ప చేప పెంపకం చేస్తూ ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు.

కేజీ నుంచి 4 కేజీల వరకు రూ. 420

గతంలో కేజీ పైగా పండుగప్ప చేప రూ. 310 ఉంటే 4 కేజీలైతే రూ. 350 ఉండేది. సప్పు, ఉప్పు నీటిలో పెరిగే పండుగప్ప చేప జూన్ నెల నుంచి భారీగా ధరలు పెరగడంతో రైతులు పెంచేందుకు మొగ్గు చూపుతున్నారు. కేజీ పైగా పెరిగితే రూ. 390, 4 కేజీల వరకు పెరిగితే టన్నెజి బట్టీ 420 పైగా ధర చెల్లించి ఈ చేపలను ముంబాయి, గోవా, కోల్‌కత్తా, బీహార్, ప్రాంతాలకే కాకుండా ఇతర దేశాలకు ఎగుమతులు చేస్తుంటారు. లోతు ఎక్కువగా ఉన్న ఎకరం చెరువులో 1500 నుంచి 2000 వరకు పండుగప్ప చేప పిల్లలను వదులుతున్నారు. వీటికి ఆహారంగా చైనా గొరకలు, చిన్న చేపలను ఆహారంగా వేస్తుంటారు. ఇలా ఏడాది కాలం లోపు పెంచితే సుమారు కిలో నుంచి 8 కిలోల వరకు ఒక్కో చేప పెరుగుతుందని రైతులు తెలుపుతున్నారు.

చిన్న, సన్నకారు రైతుల మొగ్గు

ఈ ఏడాది వనామీ సాగులో ఏప్రిల్ నుంచి వర్షాలు పడటంతో వనామీ రొయ్యలకు వైట్ స్పాట్, విబ్రియో, వైరస్‌లు వల్ల నష్టాలను చవి చూస్తున్న రైతులకు పండుగప్ప పెంపకంపై తీర ప్రాంత రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎకరం, రెండు ఎకరాలలో సాగు చేసే వనామీ సాగులో నష్టాలు రావడంతో చిన్నకారు రైతులు ఎక్కువగా 3, 4 ఎకరాల విస్తీర్ణంలో వీటిని పెంచేందుకు మొగ్గు చూపిస్తున్నారు. పెంపకంలో పెట్టుబడులు పోగా మిగులు ఉంటుందని రైతులు అంటున్నారు.

మేతగా సముద్రపు చేపలు

బతుకున్న చిన్న చేపలు దొరకకపోవడంతో కాకినాడ, రేపల్లె, ఒరిస్సా నుంచి సముద్రపు చిన్న చేపలను ఐసర్ బాక్సుల్లో తీసుకువచ్చి పండు గప్ప చేపలకు మేతగా వేస్తున్నారు. అయితే ఇటీవల ఈ చేపల లభ్యత కష్టంగా మారింది. ఏడాది సాగులో ఎకరానికి ఖర్చులు పోను రూ. 2 నుంచి 4 లక్షలు మిగలడంతో తీర ప్రాంత రైతులు పండుగప్ప సాగుపై మొగ్గు చూపుతున్నారు.

వనామీలో నష్టంతో చేపల పెంపకం

గతంలో ఎకరం చెరువులో వనామీ వేసి తీవ్రంగా నష్టపోయాను. రొయ్యలకు జబ్బులు వచ్చి చచ్చి పోవడంతో తీవ్రంగా నష్టపోయాను. గత ఏడాదిగా పండుగప్ప చేప సాగుచేస్తున్నాను. రెండు నెలలుగా చేప ధరలు పెరిగాయి. చెరువులో డీవోలో హెచ్చుతగ్గులు రాకుండా రాత్రి పగలు చెరువు వద్దే ఉండి కంటికి రెప్పలా చూసుకోవాల్సి వస్తుంది.

– ఎస్ శ్రీరాములు, రైతు, దొంగపిండి

గొరకల కోసం ఇబ్బందులు

గత రెండేళ్లుగా పండుగప్ప చేప సాగు చేస్తున్నాను. ఈ చేపలకు ఇతర రాష్ట్రాలు, విదేశాలలో బాగా డిమాండ్ ఉంది. ఈ చేపలకు ఆహారంగా చైనా గొరకలు కేజీ రూ. 40 పెరిగిపోయింది. వీటికి మేతగా గొరకలు వేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దీంతో సముద్రపు చిన్న చేపలను మేతగా వేస్తున్నాం. చేప ధరలు కేజీ రూ. 390 పైగా ఉంటే ఎక్కువగా మంది సాగు చేస్తారు.

– ఆర్. నాగరాజు, రైతు, దొంగపిండి

ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయాలి

ఆకివీడు: ఉపాధ్యాయ డిమాండ్ల పరిష్కారం కోసం శనివారం తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని మండల యూటీఎఫ్ ప్రధా నకార్యదర్శి ఆర్‌వీఎస్.నారాయణ(విక్రమ్) తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భీమవరం కలక్టరేట్ వద్ద ఉదయం 9 గంటలకు జరిగే ధర్నాలో ఎంఈఓలు, హెచ్‌ఎమ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్య పరిష్కారమే లక్ష్యంగా ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్నామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పీఆర్సీ ఇస్తానని మోసగించిందని, ఇప్పటిదాకా ఐఆర్ ఊసే లేదని, డీఏ గురించి మాట్లాడడం లేదని, ఒక్క ఇంక్రిమెంట్ తప్ప మరేం లేవని విక్రమ్ ఎద్దేవా చేశారు. 12వ పీఆర్సీ సాధన, కారుణ్య నియామకాలు, సీపీఎస్ రద్దు, ఉపాధ్యాయులకు బోధనేతర పనుల రద్దు వంటి కోసం పోరాటాల్ని తీవ్రతరం చేసేందుకు ఫ్యాప్టో చేస్తున్న ధర్నా విజయవంతం చేయాలని కోరారు.

ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

ఉండి: ఆక్వారైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి వాటి పరిష్కారానికి కృషిచేస్తానని డిప్యూటీ స్పీకర్,ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజు తెలిపారు. మండలంలోని పెదఅమిరంలో ఆక్వా రైతు సంఘ నాయకులు శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథి పాల్గొన్న ఆయన ముందు ఆక్వా రైతులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ నిచ్చారు. కార్యక్రమంలో ట్రాన్స్‌పార్మర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.గజపతిరాజు, కార్యదర్శి జీకేఎఫ్ సుబ్బరాజు, భోగిరెడ్డి శ్రీను, మంతెన రూఫ్‌కుమార్‌రాజు పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



కాళ్ల: పెదఅమిరంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



పాలకోడేరు: కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ వాణివిజయరత్నం

కాళ్ల: పుట్టిన బిడ్డకు తల్లిపాలు పడితే బిడ్డతో పాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.తులసి అన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పెదఅమిరంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు మొదటి గంటలోపు తల్లిపాలు పట్టించాలన్నారు. ఈ నెల 7 వరకు తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా అన్ని గ్రామాల్లో తమ సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తామని అన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: మండల కేంద్రమైన పాలకోడేరు, గొరగనమూడి, గొల్లలకోడేరు తదితర గ్రామాల్లోఆకివీడు ప్రాజెక్ట్ సీడీపీఓ వాణి విజయరత్నం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ వాణి విజయరత్నం మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరగడమే కాకుండా పౌష్టికాహారాన్ని అందించినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పార్వతి, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.



భీమవరం (ప్రకాశం చౌక్): తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న సీడీపీఓ లక్ష్మీకాంతం

తల్లిపాలు అమృతంతో సమానం

భీమవరం (ప్రకాశంచౌక్): తల్లిపాలు అమృతంతో సమానమని ప్రభుత్వ చైల్డ్ డెవలప్ మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కె లక్ష్మికాంతం అన్నారు. భీమవరం సెయింట్ మేరిస్ ఆసుపత్రిలో ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మి కాంతం మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డ శరీరానికి, మెదడు కూడా పోషణను ఇస్తుందని, తల్లిపాలలో ఉన్న పోషక గుణాలు మరి ఏ ఇతర పాలల్లో ఉండవన్నారు. తల్లిపాలు శిశువును న్యుమోనియా, అతిసార వ్యాధి వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి కాపాడుతుందన్నారు. ఆసుపత్రి ప్రధాన వైద్యులు డా గ్రెసియా, డా సింధు, డా సిమిలి మాట్లాడుతూ పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లి పాలు పట్టడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, సిస్టర్ అనీత్, సిస్టర్ అర్మద, సిస్టర్ సెలీన్, లిస్సి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సహాయ కేంద్రానికి విరాళం



వైద్య సహాయ కేంద్రం ట్రస్ట్‌కు విరాళం అందిస్తున్న గోపాలకృష్ణంరాజు

భీమవరం: పట్టణంలోని మెంటేవారితోట సుందరయ్య భవనంలో నిర్వహిస్తున్న వైద్య సహాయ కేంద్రానికి మోగల్లు గ్రామానికి చెందిన కలిదిండి గోపాలకృష్ణంరాజు రూ. లక్షలు విరాళం అందజేయడం అభినందనీయమని ట్రస్ట్ చైర్మన్ బి బలరామ్ అన్నారు. పేదల వైద్యం కోసం ట్రస్ట్ చేస్తున్న సేవలను గుర్తించి శుక్రవారం గోపాలకృష్ణంరాజు దంపతులు విరాళం ఇచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్య సహాయం కేంద్రం ద్వారా నిత్యం వైద్యులతో ఉచితంగా రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా డయాగ్నస్టిక్ సెంటర్స్ ద్వారా ఉచితంగా ఇసిజి, రక్తపరీక్షలు వంటివి నిర్వహిస్తున్నామని ప్రతి మూడు నెలలకు బిపి, షుగరు, ఫిట్స్, పెరాలసిస్ పేషెంట్లకు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ ఉచితంగా మందులు అందజేస్తున్నామన్నారు. వీటితోపాటు ప్రతి నెలా చిన్నపిల్లలకు గుండె పరీక్షా శిబిరం నిర్వహించిన 2డి ఎకో పరీక్షలు చేసి శస్త్రచికిత్స అవసరమైన పిల్లలకు విజయవాడలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది జి నాగరాజు, లత, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

భారత్‌పై అమెరికా సుంకాలకు సీపీఎం నిరసన



భీమవరం ప్రకాశంచౌక్ సెంటర్‌లో సీపీఎం నిరసన కార్యక్రమం దృశ్యం

భీమవరం: భారత్‌పై అమెరికా విధించిన సుంకాలతో జిల్లాలో సముద్ర ఉత్పత్తులు, రొయ్యల ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్ అన్నారు. భారత్‌పై అమెరికా సుంకాలను నిరసిస్తూ శుక్రవారం భీమవరం పట్టణంలోని ప్రకాశంచౌక్ సెంటర్‌లో నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. సుంకాలు కారణంగా అమెరికాలో భారత్ రొయ్యల ధరలు భారీగా పెరుగుతాయని ఇది వినియోగదారులపై పెను భారం మోపుతుందని, ఫలితంగా ఎగుమతులపై ప్రభావం పడి ఆక్వాపై ఆదారపడ్డ రైతాంగానికి తీవ్ర నష్టాన్ని కల్గిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రష్యా, చైనాలాంటి దేశాలు అమెరికా సుంఖాలను వ్యతిరేకిస్తుంటే ప్రధానమంత్రి నరేంద్రమోదీ నోరుమెదపకుండా వీటిపై ఇంకా అధ్యయనం చేస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బి వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడిశెట్టి రామాంజనేయులు, కె క్రాంతిబాబు, ఎం వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘ రికార్డులపై అవగాహన సదస్సు



భీమవరంలో మత్స్యకార సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న నాగలింగాచార్యులు

భీమవరం: చేపల వేట వృత్తిపై ఆధారపడిన మత్స్యకారులకు మత్స్య సహకార సంఘం ఏర్పాటు చేసారని జిల్లా సహకార శాఖాధికారి సంకు మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం భీమవరం మత్స్యశాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మత్స్య సహకార సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు మత్స్య సహకార సంఘాల రికార్డుల నిర్వహణలపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆరునెలకొకసారి సంఘ మహాసభను తప్పక ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి లబ్ధిపొందే పతకాలపై చర్చించుకోవాలన్నారు. జిల్లా మత్స్య శాఖ అధికారి కేవీఎస్ నాగలింగాచార్యులు మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా మత్స్యకారులు వనగూరే పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘ అధ్యకుడు మైల వసంతరావు, ఉపాధ్యక్షుడు బాలాజీ, మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎల్ఎల్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

శాంతి సమాజం కోసం పాటుపడాలి



తైలాభిషేక మహోత్సవంలో మాట్లాడుతున్న వక్తలు

వీరవాసరం: మండలంలో వడ్డిగూడెం మరనాత మహిమ స్వస్థతసాలలో బైబిల్ మిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం తైలాభిషేక పండుగ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మిషన్ ప్రెసిడెంట్ పి.సంజీవరావు మాట్లాడుతూ ప్రభువైన ఏసుక్రీస్తు చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని, శాంతి సమాజం కోసం పాటు పడాలని సూచించారు. ప్రత్యేక క్రీస్తు ఆలాపన, ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జీవరత్నం, సంఘ విశ్వాసులు, సంఘ కాపరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

పాలకోడేరు: మండలంలోని గోరగనమూడిలో శుక్రవారం వృద్ధాప్య, దివ్యాంగ పింఛన్లు స్థానిక జ్ఞానానంద సీనియర్ సిటిజన్స్ ఆశ్రమంలో ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితి, ఆరోగ్య పరిస్థితి, పిల్లల చదువులు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీపీఎం మురళీకష్ణ, డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీఎస్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో భీమవరం బుల్స్ లోగో జెర్సీ ఆవిష్కరణ



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో ఏపీఎల్ భీమవరం బుల్స్ లోగోను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపిఎల్) భీమవరం బుల్స్ లోగోను, జెర్సీ (డ్రెస్ కోడ్) శుక్రవారం డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ భీమవరం బుల్స్ టీం భీమవరం ఖ్యాతి నిలిచేలా క్రీడాకారులు కూడా కష్టపడి ఆడాలన్నారు. కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణమరాజు మాట్లాడుతూ అత్యంత ప్రతిష్ఠాకరమైన భీమవరం బుల్స్ క్రికెట్ టీం లోగో జెర్సీ ఆవిష్కరణ తమ కళాశాల ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. ఏపీఎల్ భీమవరం బుల్స్ టీం కెప్టెన్ నితీష్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీఎల్ లీగ్స్ వల్ల రాష్ట్రంలోని క్రీడాకారులకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం కెప్టెన్ నితీష్ కుమార్‌రెడ్డి, మునీష్ వర్మ, హేమంత్‌కుమార్‌లను సత్కరించారు.

కొయ్యే మోషేన్‌రాజు పరామర్శలు



దానియేలును పరామర్శిస్తున్న శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

భీమవరం అర్బన్: మండలంలోని గూట్లపాడు గ్రామంలో శుక్రవారం ఇటీవల ప్రమాదానికి గురైన వైఎస్సార్ సీపీ నాయకుడు సంధి దానియేలును శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మేమంతా అండగా ఉన్నామని అధైర్య పడవద్దని పూర్తిగా విశ్రాంతి తీసుకుని ఆరోగ్యం మెరగయ్యేవరకు డాక్టర్ సూచనలు, సలహాలు పాటించాలని దానియేలుకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జల్లా కొండయ్య, నాయకులు రేవు నరసింహస్వామి, మద్దా ఫిలిప్, గారపాటి భవాని, తదితరులు పాల్గొన్నారు.

పీ4 కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

భీమవరం(ప్రకాశంచౌక్): పీ4లో భాగంగా జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ పరిశ్రమల యాజమాన్యాలతో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పేద వర్గాల వారిని ఆర్థికంగా, బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. మార్గదర్శకులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని వారికి చేయూతనిస్తే వారు ఆర్థికంగా ఎదుగుతారన్నారు. ఇప్పటికే జిల్లాలో 1,700 మంది మార్గదర్శకులు రిజిస్టర్ చేసుకొని 35 వేల బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, సీపీఓ కంటిపూడి శ్రీనివాసరావు, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ నాగలింగాచార్యులు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.స్వాతి, గోదావరి మెగా ఆక్వా ఫుడ్ పార్క్, ఆనంద మెరైన్, జయలక్ష్మి సీ ఫుడ్, వాన్ బర్రీ, వెల్కమ్ ఫిషరీస్ వివిధ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని కాపవరం గ్రామంలో శుక్రవారం పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వీరి నుంచి రూ. 2900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మూర్తి వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.